

రవీంద్రభారతి థియేటర్‌లో సాంస్కృతిక శాఖ డైరెక్టర్‌తో జిల్లా కళాకారులు

## రవీంద్రభారతిలో జిల్లా లఘుచిత్రాల ప్రదర్శన

భీంపూర్, అక్టోబర్ 8 : హైదరాబాద్ రవీంద్రభారతి పైడిజైరాజ్ ప్రివ్యూ థియేటర్‌లో ఆదిలాబాద్ జిల్లా కళాకారులకు సంబంధించిన లఘు చిత్రాలు, ఆల్బమ్ సాంగ్స్ చిత్రాలు ప్రదర్శించారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు వీటిపై రివ్యూ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ వీరిని అభినందించారు. సందేశాత్మక చిత్రాలు సమాజానికి ప్రయోజనం చేకూరుస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కవి కాంచ నవల్లి రత్నాకర్ ,రమేశ్ కిషన్ గౌడ్ ,డ్యాన్స్ మాస్టర్ మిట్టు దత్తు , రవి, యువ గాయనీ గాయకులు ,లఘుచిత్రాల దర్శకులు, నిర్మాతలు పాల్గొన్నారు.

## నాగోబా ఆలయంలో ఆదివాసీల పూజలు



నాగోబా ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న కెస్లాపూర్ గ్రామస్తులు

ఇంద్రవెల్లి, అక్టోబర్8: మండలంలోని ఆదివాసీల ఆరాధ్యదైవం నాగోబా ఆలయంలో ఆదివాసీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం మండలంలోని కెస్లాపూర్ గ్రామస్తుల ఆధ్వర్యంలో నాగోబాకు ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. అనంతరం నాగో బా ఆలయ అవరణలోని మైసమ్మదేవతతోపాటు వారి కులదేవతలకు ప్రత్యేక పూ జలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామస్తులందరూ కలిసికట్టుగా తమ వద్ద ఉన్న పశువులకు నాగోబా ఆలయానికి ప్రదక్షిణలు చేయించారు. పిల్లా పాపలతోపాటు ప్రజ లు, పశువులు, జంతువులు ఆయురారోగ్యలతో క్షేమంగా ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని నాగోబా దేవతను మొక్కుకున్నామని ఆదివాసీల పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కెస్లాపూర్ గ్రామపటేల్ మెస్రం వెంకట్‌రావ్‌పటేల్, బాజీరావ్‌పటేల్, కోసేరావ్, కోట్వాక్ బారిక్‌రావ్, తోడసం సాగర్, నాగ్‌నాథ్, ఆనంద్‌రావ్, షేక్‌నాథ్, లింబారావ్, నాగోబా ఆలయ పూజారి మెస్రం షేకు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 8 : కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఆదిలాబాద్ పర్యటన సందర్భంగా జిల్లాకేంద్రంలోని డైట్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేయనున్న బహిరంగసభ ఏర్పాట్లను పరిశీలించి, భద్రతా చర్యలపై, ట్రాఫిక్‌పై సమీక్ష నిర్వహించి సిబ్బందికి, ఎస్పీ డి.ఉదయ్ కుమార్‌రెడ్డి సూచనలు ఇచ్చారు. కేంద్ర హోం శాఖ మంత్రి పర్యటనలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కట్టుదిట్టమైన మూడంచెల భద్రతను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎస్పీ వెంట ఆదిలాబాద్ ఒకటో పట్టణ, సీఐ ట్రాఫిక్ సీఐ, సిబ్బంది పాల్గొన్నారు.

## సాఫ్ట్ బాల్ ఎంపిక పోటీలు



ఎంపికైన బాలికల జట్టు

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 8 : జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఆదివారం సాఫ్ట్ బాల్ ఎంపిక పోటీలను నిర్వహించారు. జిల్లాలోని 150 మంది క్రీడాకారులు ఈ ఎంపిక పోటీల్లో పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 11న చించోలి బి గ్రామంలో నిర్వహించనున్న జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. అండర్ 17 బాలబాలికల ఎంపిక పోటీలు చించోలిలో జరుగనుండగా..అండర్ 14 బాలబాలికల సాఫ్ట్ బాల్ ఎంపిక పోటీలు ఆదిలాబాద్ జిల్లాలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో పోటీలను నిర్వహిస్తామని ఎస్‌జీఎఫ్ఐ సెక్రటరీ రమణ తెలిపారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ఐ సెక్రటరీ రమణ, పేట అసోసియేషన్ సెక్రటరీ బహుజన్, కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ వన్నెల భూమన్న, సాఫ్ట్‌బాల్ సెక్రటరీ అన్నపూర్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు బుచ్చిరామారావు, అంబాజీ, జమున, ప్రేమలత, సుజాత, భూమేశ్ తదితరులు ఉన్నారు.

# పంచాయతీలకు కొత్త భవనాలు

- నిర్మల్ జిల్లాకు 130 భవనాలు మంజూరు
- ఒక్కో గ్రామ పంచాయతీ భవనానికి రూ.20 లక్షలు మంజూరు
- కొత్తగా ఏర్పడిన పంచాయతీలకు సైతం నూతన భవనం
- హర్షం వ్యక్తం చేస్తున్న సర్పంచ్‌లు





దిలావర్‌పూర్: సిర్గాపూర్‌లో నిర్మిస్తున్న నూతన గ్రామపంచాయతీ భవనం

దిలావర్‌పూర్ అక్టోబర్ 8 : పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు...గ్రామాలు బాగుంటేనే దేశం, రాష్ట్రం బాగుంటుందని నమ్మిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆ గ్రామాల్లో పరిపాలన భవనాలు బాగుంటేనే గ్రామం బాగుంటుందనే నమ్మకంతో నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీలతో పాటు, శిథిలావస్థలో ఉన్న గ్రామపంచాయతీల భవనాలను గుర్తించి వాటి స్థానంలో నూతన భవనాలు నిర్మించేందుకు సర్కారు ముందుకు వచ్చింది. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి అల్లోల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాల ఎమ్మెల్యేల కోరిక మేరకు ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్మల్ జిల్లాకు నూతనంగా 130 గ్రామ పంచాయతీలను మంజూరు చేసి నిధులను విడుదల చేశారు. ఈ నిధులతో గ్రామాల్లో నూతన పంచాయతీ భవనాల ఏర్పాటుకు సంబంధిత శాఖ అధికారులు ప్రజాప్రతినిధులు కలిసి పనులు ప్రారంభిస్తున్నారు.

- **జిల్లాలో 130 జీపీ భవనాలు మంజూరు**

నిర్మల్ జిల్లాలోని మూడు నియోజకవర్గాలను కలుపుకొని నూతన పంచాయతీ భవనాల ఏర్పాటుకు ఉపాధి హామీ పథకం నిధుల కింద 130 గ్రామపంచాయతీలు మంజూరయ్యాయి. ఒక్కొక్క గ్రామపంచాయతీ భవనానికి రూ. 20 లక్షలను మంజూరు చేసింది. ఈ నిధులతో భవనాలు నిర్మించేందుకు కొన్ని గ్రామాల సర్పంచ్‌లు ముందుకు వచ్చి పనులు చేపట్టుతున్నారు. నిర్మల్ నియోజకవర్గంలోని 52 గ్రామపంచాయతీలు, ముథోల్ నియోజక వర్గంలో 50 గ్రామపంచాయతీలు, ఖానాపూర్ నియోజకవర్గంలో 28 నూతన జీపీ భవనాలకు నిధులు మంజూరు చేసింది. ఈ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు నిత్యం సమీక్షలు నిర్వహిస్తున్నారు.

- **అత్యధిక పంచాయతీ భవనాలు కుభీర్, మామడకు మంజూరు..**

నిర్మల్ జిల్లాలని కుభీర్ మండలంలోని అత్యధికంగా 17 గ్రామ పంచాయతీ నూతన భవనాలు మంజూరయ్యాయి. అదేవిధంగా నిర్మల్ నియోజకవర్గంలోని మామడ మండలంలోని 15 గ్రామ పంచాయతీలు మంజూరయ్యాయి. కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీలకు నూతన భవన నిర్మాణం కోసం రూ. 20 లక్షలను మంజూరు చేసింది.

**కొత్త పంచాయతీకి నూతన భవనం మంజూరైంది.**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ 500లకు పైగా ఉన్న గ్రామాలను పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. అందులో మా ఊరు గ్రామ పంచాయతీగా ఎంపికై ఎన్నికలు నిర్వహించారు. నేను మొదటిసారిగా ఏర్పడిన పంచాయతీకి సర్పంచ్ కావడం ఆనందంగా ఉంది. తక్కువ సమయంలో రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి కృషితో మా గ్రామానికి నూతన గ్రామపంచాయతీ భవనం మంజూరు కావడం ఆనందంగా ఉంది. ఈ భవన నిర్మాణ పనులను రెండు మూడు రోజుల్లో ప్రారంభిస్తాం.

-రొడ్డ మహేశ్ ,సర్పంచు మాయాపూర్

**నూతన భవనం కట్టడం ఆనందం కలిగించింది..**



నేను సర్పంచ్ అయిన తరువాత నా హయాంలో నూతన గ్రామ పంచాయతీ భవనం కట్టి అందులో నుంచి పాలన కొనసాగించడం ఎంతో ఆనందం కలిగించింది. మా గ్రామంలో సంవత్సరాల తరబడి పంచాయతీ భవనం ఉండపోయేది. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రత్యేక నిధులు కేటాయించడంతో మండలంలోని మోడల్ గ్రామ పంచాయతీగా నిర్మాణం చేపట్టాను. పంచాయతీ భవనం కట్టాలనే నా కోరిక నేరవేరింది.

\- - గంగారెడ్డి, సర్పంచు సిర్గాపూర్

# మరోసారి దీవించండి

- అమ్మవారి ఆలయం నుంచి ప్రచారం రథాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- బీఆర్ఎస్‌లో చేరిన పలువురికి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

బాసర, అక్టోబరు 8 : మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బాసర సరస్వతీ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం నుంచి ప్రచార రథాన్ని ప్రారంభించారు. బాసరలోని రైల్వేస్టేషన్ వద్ద గల శివాజీ చౌక్ నుంచి భారీ ర్యాలీగా అమ్మవారిని ఆలయం వద్దకు పార్టీ కార్యకర్తలతో కలిసి చేరుకున్నారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకు పోతున్నదన్నారు. రాష్ట్రంలో మరోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సహకారంతో ముథోల్ తాలుకాను అభివృద్ధి చేశానని మరోసారి అవకాశం కల్పించాలని కోరారు. ఇంటింటికి సంక్షేమ పథకాన్ని అందజేస్తున్న ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమని, ప్రజలు మరోసారి తమను ఆశీర్వదించాలని కోరారు. బాసరకు చేరుకున్న ఎమ్మెల్యే విఠల్ రెడ్డిని నాయకులు డప్పు చప్పుల్లతో ఘన స్వాగతం పలికారు. అనంతరం మండలంలో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. బీటీరోడ్లు, సీసీ రోడ్లు, డైనేజీ నూతన దేవాలయాల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈయన వెంట సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు సుధా కర్‌రెడ్డి, బాసర సర్పంచ్ లక్ష్మణరావు, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ రమేశ్ రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుధాకర్‌రావు, బీఆర్ఎస్ యువ నాయకులు కార్తీక్ రావు, జ్ఞానిపటేల్, నరేశ్‌రావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- **దోడాపూర్‌లో..**

బాసర, అక్టోబరు 8 : మండలంలోని దోడా పూర్‌లో ఆదివారం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అభివృద్ధి పనులను ప్రారంభించారు. అదే విధంగా ఎమ్మెల్యే సమక్షంలో సుమారు 20 మంది వరకు గ్రామస్తులు బీజేపీ నుంచి బీఆర్ ఎస్‌లోకి చేరగా ఎమ్మెల్యే వారికి కండువా కప్పి స్వాగతించారు. కార్యక్రమంలో సర్పంచ్ విద్యా దీపక్, ఎంపీటీసీ దిగంబర్, ఉపసర్పంచ్ సంతో ష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రమేశ్, సంతోష్ పాటిల్, వార్డు మెంబర్లు ఉన్నారు.

- **బీఆర్ఎస్‌లో పలువురి చేరిక**

లోకేశ్వరం, అక్టోబర్, 8: లోకేశ్వరం మండలంలోని గడ్‌చాంద గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ సాయన్న, మాజీ సర్పంచ్ గంగన్నలు బీజేపీ నుంచి ఆదివారం బీఆర్ఎస్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే విఠల్ రెడ్డి సమక్షంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, ఎంపీపీ లలితా భోజన్న, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్ రావు, బీఆర్ఎస్ మండల కన్వీనర్ కరిపే శ్యాంసుందర్, సర్పంచ్‌లు వెంకట్ రావు, భుజంగ్‌రావు పటేల్, దార్యాడి కపిల్ భీంరావు పటేల్, మాజీ ఎంపీపీ సాగర్, మాజీ సర్పంచ్ సుదర్శన్ రెడ్డి, ప్యాట సుధాకర్, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

**సుమారు 1000 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం**

దస్తురాబాద్,అక్టోబర్ 8 : మండలంలోని ఎర్రగుంట గ్రామంలో ఆదివారం ఎస్ఐ బి.ప్రభాకర్ రెడ్డి ఆకస్మాకంగా వెళ్లి అక్కడ తయారు చేస్తున్న గుడుంబా స్థావరాలపై మెరుపు దాడులు నిర్వహించారు.ఈ దాడుల్లో గుడుంబా తయారీ కోసం అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 1000 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. అనం తరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడు తూ..గుడుంబా తయారీ చట్ట రీత్యా నేరమన్నారు.గుడుంబా విక్రయించినా, తయారు చేస్తూ పట్టుబడితే వారి పై కేసులు నమోదు చేస్తా మని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది లక్ష్మణ్, డైవకర్,ఎస్‌డీ షఫి ఉద్దీన్, సీహెచ్ రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

- **కడెంలో..**

కడెం, అక్టోబర్ 8: నిషేధిత గుడుంబాను తయారు చేసినా, విక్రయించిన చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని కడెం ఎస్ఐ కోసన రాజు హెచ్చరించారు. ఆదివారం మండలంలోని పెద్దూర్‌తాండలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన నగావత్ రమేశ్ అనే వ్యక్తికి చెందిన 500 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. అనంతరం గ్రామంలో పలు ఇండ్లల్లో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రభుత్వం నిషేధించిన గుడుంబాను తయారు చేసినా, విక్రయించినా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ నిబంధనలను అతిక్రమించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.